## నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

మహబూబాబాద్ రూరల్ : పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి, తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుంచి జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి రవీందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులకు మూడు దశల్లో శిక్షణ ఉంటుందన్నారు. తెలంగాణ ఆదర్శ పాఠశాల, హోలీ ఏంజెల్స్, ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో శిక్షణ ఉంటుందని తెలిపారు.

## శిక్షణ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

మహబూబాబాద్ రూరల్ : జిల్లాలో నేటి నుంచి నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్ అన్నారు. సోమవారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం వరకు మాత్రమే తరగతులు నిర్వహించాలన్నారు. మూడు శిక్షణ సెంటర్లలో కూలర్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, నీలయ్య, హరినాయక్, వీరన్న పాల్గొన్నారు.

## ఉద్యాన విశ్వవిద్యాలయం సందర్శన

మహబూబాబాద్ రూరల్, మే 12 : మల్యాల గ్రామంలోని శ్రీ కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిశోధన స్థానాన్ని సోమవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ హార్టికల్చర్ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొండాలక్ష్మణ్ తెలంగాణ విశ్వవిద్యాలయంలో పరిశోధనలకు అనువైన ప్రదేశం మల్యాల గ్రామమని అన్నారు. ఇక్కడ అధికంగా మామిడి, జామ, సపోటా, పనస పంటలపై పరిశోధనలు జరుగుతున్నాయని, మల్యాల ద్వారా వరంగల్ చపాటా మిరప కాయకు భౌగోళిక గుర్తింపు లభించిందన్నారు. ఈ ప్రాంతంలో పండే మిరపను టమాట మిరపకాయ అని కూడా అంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి పాల్గొన్నారు.

## 60 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

మహబూబాబాద్ రూరల్, మే 12 : వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం 60.7 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మానుకోట డివిజన్ ఎక్సైజ్ సీఐ చిరంజీవి కథనం ప్రకారం.. పట్టణంలోని రైల్వేస్టేషన్, కురవి గేట్ సమీపంలో వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లా ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించింది. రైల్వేగేట్ సమీపంలో పొదల్లో రెండు ప్లాస్టిక్ సంచులు కనిపించగా, వాటిని పరిశీలించి ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే రెండు సంచుల్లో ఉన్న 60.7కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తులు పరారీలో ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు అశోక్, కిరీటి, కానిస్టేబుల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## తొర్రూరు నుంచి కాళేశ్వరానికి బస్సులు

తొర్రూరు, మే 12 : కాళేశ్వరంలో ప్రారంభమయ్యే సరస్వతీ పుష్కరాల కోసం తొర్రూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తొర్రూరు డిపో మేనేజర్ వీ పద్మావతి సోమవారం ప్రకటనలో తెలిపారు. తొర్రూరు పట్టణం, పరిసర ప్రాంతాల భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భక్తుల రద్దీ పెరిగే కొద్ది బస్సుల సంఖ్యను పెంచుతామన్నారు. బస్సు సర్వీస్‌ల సమాచారాన్ని భక్తులు స్థానిక డిపో లేదా అధికారిక ప్రకటనల ద్వారా తెలుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## తునికాకు కూలీపై అడవిదున్న దాడి

గంగారం, మే 12 : అడవి దున్న దాడిలో తునికాకు కూలీకి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కొడిశలమిట్ట గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం కొడిశలమిట్ట గ్రామానికి చెందిన గుంట సూర్యకాంత్ సమీప అటవీ ప్రాంతంలో తునికాకు సేకరిస్తుండగా, అడవి దున్న ఒక్కసారిగా దాడి చేయడంతో కుడి కాలుకు గాయాలయ్యాయి. అక్కడే ఉన్న కొందరు కూలీలు వెంటనే అతడిని గ్రామానికి తరలించి, అక్కడి నుంచి ఇల్లందు తీసుకవెళ్లారు.

## నీటిలో మునిగి ఒడిశా కూలి మృతి

బయ్యారం : నీటిలో పడి ఒడిశా కూలి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని నామాలపాడు శివారులో ఉన్న ఇటుక బట్టీలో ఒడిశాకు చెందిన గౌతమ్(60) కూలీగా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం స్నానం కోసం కోసం పక్కనే ఉన్న వ్యవసాయ బావి వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. అటుగా వెళ్తున్న కూలీలు బావిలో మృతదేహాన్ని గమనించి బయటికి తీశారు. బట్టి యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## గుండెపోటుతో చిరువ్యాపారి మృతి

కురవి, మే 12 : గుండెపోటుతో చిరు వ్యాపారి వందనపు శ్రీనివాస్(60) సోమవారం మృతి చెందాడు. మండలంలోని రాజోలు గ్రామానికి చెందిన వందనపు శ్రీనివాస్, అతడి భార్య శ్రీదేవి మొగిలిచర్ల గ్రామంలో నివాసముంటున్నారు. వీరు ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంపై సోమవారం కురవికి వచ్చి, తిరిగి సాయంత్రం ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో శ్రీనివాస్‌కు గుండెలో నొప్పి రావడంతో భార్య మహబూబాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. భర్త మృతి చెందడంతో భార్య శ్రీదేవి స్పృహ తప్పి కిందపడిపోవడంతో ఆమెను జిల్లాకేంద్రంలో వైద్యశాలకు తరలించారు. శ్రీనివాస్‌కు ముగ్గురు కుమారులున్నారు.

## చెక్ డ్యామ్ పునరుద్ధరణకు కృషి చేస్తా..

తొర్రూరు, మే 12 : గుర్తూరు గ్రామ పరిధిలోని పాత చెక్ డ్యామ్‌ను సోమవారం ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెక్‌డ్యామ్ పునరుద్ధరణకు నిధులు కేటాయింపునకు కృషి చేస్తానన్నారు. ఆమె వెంట ఎస్సై ఉపేందర్, ఇరిగేషన్ డీఈ శ్యామ్‌కుమార్, ఇరిగేషన్ ఏఈలు ఉన్నారు.

## వడ్ల బస్తాలు తరలించడం లేదని రైతు ఆత్మహత్యాయత్నం

### కిరోసిన్ పోసుకోవడానికి యత్నించగా అడ్డుకున్న స్థానికులు


రైతు యాకూబ్

దంతాలపల్లి, మే 12 : కాంటాలు పెట్టిన బస్తాలు మిల్లుకు తరలించడం లేదంటూ ఓ రైతు ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన ఎండీ యాకూబ్ 38 రోజుల క్రితం వరి కోసి గ్రామంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు పోశాడు. పూర్తిస్థాయిలో ఆరబెట్టిన తరువాత తేమశాతం వచ్చినా తన వడ్లు కాంటాలు పెట్టకుండా పలుకుబడి ఉన్నవారివి ముందు కాంటాలు పెట్టారని గతంలో కూడా నిర్వాహకులతో ఘర్షణ పడ్డాడు. ఆ తర్వాత 354 బస్తాలను కాంటాలు పెట్టారు. (దొడ్డు,సన్న) మిల్లులకు తరలించే విషయంలో కూడా క్రమ పద్ధతిని పాటించకుండా నిర్వాహకులకు ఇష్టం ఉన్నవారి బస్తాలు లోడ్ చేస్తుండగా ముందు గా వచ్చిన నా బస్తాలు పెట్టకుండా వేరేవాళ్లవి ఎందుకు పెడుతున్నారని నిర్వాహకులను ప్రశ్నించాడు. దీంతో ఎమ్మెల్యేకు చెప్పుకుంటావో ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోపో అనడంతో మనస్తాపానికి గురైన యాకూబ్ ఇంటి దగ్గర నుంచి కిరోసిన్ వెంట తెచ్చుకొని కొనుగోలు కేంద్రం వద్ద ఒంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకోగా గమనించిన స్థానికులు అడ్డుకొని నచ్చచెప్పారు. ఆ తర్వాత యాకూబ్ బస్తాలను మిల్లుకు తరలించారు. దీనిపై పీఏసీఎస్ సీవో వెంకన్నను వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని, మంగళవారం కొనుగోలు కేంద్రానికి వెళ్లి తెలుసుకుంటానన్నారు.



మహబూబాబాద్ పట్టణంలోని కొనుగోలు కేంద్రంలో కాంటాలు నిలిచిపోవడంతో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు

# ధాన్యం రైతుల దైన్యం

- కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కరువు
- వడదెబ్బతో పిట్టల్లా రాలిపోతున్న అన్నదాతలు
- కాంటాల కోసం రోజుల తరబడి నిరీక్షణ
- పేరుకుపోతున్న ధాన్యపు రాశులు

మహబూబాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ) : ఎంతో శ్రమకోర్చి వడ్లు పండించిన రైతులకు వాటిని అమ్ముకోవడానికి అంతకన్నా ఎక్కువ శ్రమ పడాల్సి వస్తున్నది. వడ్లు పండించడం ఒక ఎత్తయితే.., వాటిని అమ్ముకోవడం మరో ఎత్తుగా మారింది. ప్రభుత్వం ప్రకటనలు చేయడం తప్పా.. రైతులను పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలను నిలువు దోపిడీ చేస్తున్నా పట్టించుకొనే వారు లేరని బాధపడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం కదలకపోవడంతో రైతులు ఎవరి చెప్పుకోవాలో తెలియక దైన్య స్థితిలో ఉండిపోయారు. యాసంగి వడ్ల కొనుగోళ్ల కోసం యంత్రాంగం జిల్లావ్యాప్తంగా 174 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే, అన్నీ సవ్యంగా సాగితే కొనుగోళ్ల ప్రక్రియ ఇప్పటికే తుది దశకు చేరుకోవాలి. కానీ, ప్రభుత్వ పట్టింపులేనితనం, అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా సగం కూడా కొనుగోళ్లు జరగలేదు. రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో నిరీక్షిస్తున్నారు. ఈ ఏడాది యాసంగి మొదటి నుంచి రైతులు వరి పంటను కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. సాగు నీళ్లు అందక కొన్ని రోజులు, అకాల వర్షాలతో మరికొన్ని రోజులు ఇబ్బంది పడి పంటను కాపాడుకొన్నారు. చివరికి చేతికొచ్చిన ధాన్యాన్ని కూడా అమ్ముకోవడానికి అనేక కష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకెళ్లిన అడుగడుగునా ఇబ్బందులే ఎదురవుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించినా ఎక్కడా అమలు కావడంలేదు. వడ్లు నింపుదామంటే గన్నీ సంచులు లేవు. కనీసం నీడకు ఉందామంటే టెంట్లు లేక చెట్ల నీడనే ఉండాల్సి వస్తున్నది. తాగడానికి నీళ్లు లేక ఇంటి వద్ద నుంచే తెచ్చుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఏ కొనుగోలు కేంద్రాన్ని చూసినా రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగానే ఉన్నది. కొనుగోలు కేంద్రాలకు వడ్లు తెచ్చి రోజులు గడుస్తున్నా కాంటాపెట్టే నాథుడే లేకుండాపోయారు. ఇదిలా ఉంటే మరోవైపు కాంటా అయిన వడ్లను తరలించడంలో అధికారులు తీవ్రనిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. లారీలు రాక, ధాన్యం కదలక కొనుగోలు కేంద్రాల్లో ధాన్యపు రాశులు కుప్పలు కుప్పలుగా పేరుకుపోయాయి. అసలే ఎండాకాలం కావడంతో ఇప్పటికే కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎండ దెబ్బతగిలి చనిపోతున్నారు. గతంలో నెల్లికుదురు, తొర్రూరు మండలాల్లో వడదెబ్బ తగిలి కొనుగోలు కేంద్రాల్లో రైతులు మృతిచెందగా, తాజాగా పెద్దవంగర మండలంలో సోమవారం జరిగింది. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఉండేందుకు నీడకోసం కనీస ఏర్పాట్లు చేయకపోవడంతో వడదెబ్బ తగిలిచనిపోతున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రా ల్లో కనీస వసతులు కల్పించాలని, కొనుగోలు కేంద్రాల్లో త్వరగా కాంటాలు ప్రారంభించి ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.

### వడ్లు తెచ్చి 32 రోజులు దాటింది..



ముడుపుగల్ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి 32 రోజులు అవుతున్నది. గత నెల 10న కొనుగోలు కేంద్రానికి వడ్లు తెచ్చాను. మొదట తేమశాతం పేరుతో కొనలేదు.. రేపు మాపు అంటూ ఆలస్యం చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ధాన్యం తడవడంతో మళ్లీ ఆరబెట్టాను. ఎండిన తర్వాత కొనుగోలు చేస్తామని చెప్పి న నిర్వాహకులు ఇప్పటికీ ఇటువైపు చూడలేదు. చేసేదేమీ లేక ఇక్కడే ఉండి ఎదురు చూస్తున్నా. ఇప్పటికైనా కాంటాలు పెట్టాలని వేడుకుంటున్న.

*– బాబురావు, రైతు ముడుపుగల్, మహబూబాబాద్*


ఎమ్మెల్సీ రవీందర్ రావును కలిసిన రైతులు, సంఘాల నాయకులు

## ఎమ్మెల్సీ రవీందర్‌రావును కలిసిన రైతులు

మహబూబాబాద్ రూరల్/నెల్లికుదురు : ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావును సోమవారం ఆయన నివాసంలో నెల్లికుదురు మండలం రాజులకొత్తపల్లి గ్రామ రైతులు, వివిధ సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. గత వానకాలం సీజన్‌లో భారీ వర్షాల వల్ల గ్రామంలో ఉన్న చెరువు ఐదు చోట్ల తెగిపోయిందని, ఇంత వరకు మరమ్మతు చేయలేదన్నారు. చెరువు కింద కొన్ని వందల ఎకరాలు సాగవుతున్నదని, అధికారులు చొరవ తీసుకొని మరమ్మతు చేయించాలని కోరారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి వెంటనే చెరువు సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ రైతులకు హామీ ఇచ్చారు.


ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

## సత్వరమే పరిష్కరించాలి

### ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ రూరల్, మే 12 : ప్రజావాణిలో వచ్చిన వినతులను సత్వరమే పరిశీలించి, పరిష్కరించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. బయ్యారం మండలం ఇర్సులాపురం గ్రామానికి చెందిన రామగిరి శ్రీను తన ఇంట్లో ఇద్దరు దివ్యాంగులు ఉన్నారని, ప్రభుత్వం ద్వారా వచ్చే ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. మానుకోట మండలం కంబాలపల్లికి చెందిన వంగూరి స్రవంతి తన భర్తకు దూరంగా ఉంటున్నాని ఉపాధి సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. పట్టణంలోని రెడ్డి బజార్‌కు చెందిన కే జ్యోతి తనకు కుమారస్వామి హాస్పిటల్ పక్కన 96 గజాల ఇంటి స్థలం ఉందని, ఇటీవల కొంతమంది వ్యక్తులు ఆక్రమించుటకు ప్రయత్నం చేస్తున్నారని, ఇంటి జాగ ఆక్రమణకు గురికాకుండా న్యాయం చేయాలని కోరారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, గృహ, గ్రామీణాభివృద్ధి శాఖలు కలుపుకొని మొత్తం 85 ఫిర్యాదు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.


బాసుతండా పంచాయతీ కార్యదర్శిని నిలదీస్తున్న ప్రజలు

## పనికి రాని వారికి పైసలు ఎలా ఇచ్చారు?

### పంచాయతీ కార్యదర్శిని నిలదీసిన ప్రజలు

నర్సింహులపేట : ఉపాధి పనికి రాని వారికి పైసలు ఎలా వచ్చాయని సోమవారం మండలంలోని బాసుతండాలో పంచాయతీ క్యారదర్శిని ఆ గ్రామ ప్రజలు నిలదీశారు. మండలంలోని బాసుతండాలో జీపీ పరిధిలో పనులు చేయకున్నా 20మంది పేర్లు మస్టర్లలో రాసి డబ్బులు మంజూరు చేశారని ఆరోపించారు. కొలుతలు, ఎంఎంఎస్ ఫొటోలు ఏలా తీశారని, మస్టర్లలో పంచాయతీ కార్యదర్శి సంతకం ఎలా చేశారని ప్రశ్నించారు. పనికి పోయిన వారికి ఇప్పటి వరకు పైసలు రాలేదన్నారు. ఈ ఈ విషయంపై ఎంపీడీవో యాకయ్యకు వినతి పత్రం అందజేశారు. జీపీ పరిధిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ నాయక్

## మానవాళికి మార్గదర్శి గౌతమ బుద్ధుడు

మహబూబాబాద్ రూరల్, మే 12 : ప్రపంచ మానవాళికి మార్గదర్శి గౌతమ బుద్ధుడని గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో గౌతమ బుద్ధుడి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ నాయక్ మాట్లాడుతూ.. బుద్ధుడు శాంతి, అహింసను బోధించారని, అసమానతలను తొలగించి కులరహిత సమాజం కోసం పునాదులు వేసినట్లు తెలిపారు. దళిత, పీడిత వర్గాల స్త్రీల విముక్తి కోసం సన్మార్గాన్ని చూపిన మహోన్నతుడని అన్నారు. బుద్ధుడి ఆలోచన విధానంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వాసం ఆనంద్, అశోక్, దుడ్డెల రామ్మూర్తి, చందూలాల్, ఎల్లేశ్, రమేశ్, సురేశ్, నాగరాజు పాల్గొన్నారు.


సంతలో రైతులు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కురవి, మే 12 : ప్రాణాంతకమైన డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలోని వారాంతపు పశువుల సంతలో సోమవారం 'వద్దు వద్దు మద్యం, డ్రగ్స్ వద్దు, ఆరోగ్యమే ముద్దు' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. యువత మత్తుబారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కురవి ఏఎస్సై వెంకన్న, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## ఎప్‌సెట్‌లో మెరిసిన పేదింటి బిడ్డ

### అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 283వ ర్యాంకు


తల్లిదండ్రులతో విద్యార్థిని అంజనప్రియ

ఇనుగుర్తి, మే12 : రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన ఎప్‌సెట్– 2025 ఫలితాల్లో ఇనుగుర్తి మండలానికి చెందిన పేదింటి బిడ్డ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 283వ ర్యాంకు సాధించింది. ఇనుగుర్తి మండలం కోమటిపల్లికి చెంది న గోసుల రమేశ్,రేణుక దంపతులకు ఇద్దరు కూతు ళ్లు, కొడుకు ఉన్నారు. రమేశ్ రోజువారి తాపీమేస్త్రీ. పెద్దకూతురు గోసుల అంజనప్రియ ఎఫ్‌సెట్‌లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో 101.75 మార్కు లు సాధించి రాష్ట్రస్థాయిలో 283 ర్యాంకుతో సత్తా చాటింది. 10వ తరగతి వరకు ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం, ఇంటర్ ఖమ్మంలోని అంబేద్కర్ సీవోఈలో చదివిం ది. ప్రతిభ కనబరిచిన అంజనప్రియను గ్రామస్తులు అభినందించారు.

## పట్టా భూములున్న రైతులకు బావులకు అనుమతివ్వాలి

### జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్


రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు

గూడూరు : పట్టాలున్న రైతులు బావులు తవ్వకునేందుకు అనుమతి ఇవ్వాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం మండలంలోని గుండెంగ గ్రామంలో గిరిజన రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామంలోని అటవీ భూములను సాగుచేసుకుంటున్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ.. భూమిని నమ్ముకొని జీవిస్తున్న గిరిజన రైతులకు అటవీ హక్కుల ప్రకా రం భూములు నీటి సౌకర్యం కల్పించాలని, గుండెంగ గ్రామం వరంగల్, మహబూబాబాద్ సరిహద్దులకు ఆనుకొని ఉందన్నారు. దీంతో ఇక్కడి రైతులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు ఇవ్వకపోవడంతో రైతులు నీటి సమస్యతో ఇబ్బందిపడుతున్నారని, వెంటనే అధికారులు ప్రజల పక్షాన ఆలోచించి పట్టాలు మంజూరు చేయించి, బావులు తవ్వుకునేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్‌రావు, ఫారెస్టు అధికారులు పాల్గొన్నారు.

## వందేభారత్ ట్రైన్ హాల్టింగ్ కల్పించాలి

మహబూబాబాద్ రూరల్ : గరీబ్‌రథ్, సంఘమిత్ర, జీటీ, వందేభారత్ ట్రైన్లకు మానుకోట రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ కల్పించాలని సోమవారం పట్టణంలో జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోతు హుస్సేన్‌నాయక్‌కు జిల్లా క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా రైల్వే స్టేషన్‌లో నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్‌లో సౌకర్యాలు కల్పించాలని హుస్సేన్‌నాయక్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో క్లాత్ మర్చంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బవిరిశెట్టి రాజేశ్వర్‌రావు, కార్యదర్శి ఎండీ జానీ, ఉపాధ్యక్షుడు నవీన్, శివ, శ్రీపాల్ పాల్గొన్నారు.

## శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కురవి, మే 12 : వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కురవి హెచ్‌ఎం ఎండీ వాహీద్ అన్నారు. కురవి, రాజోలు హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆంగ్లం, గణితాన్ని డిజిటల్ పద్ధతిలో ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వెంపటి విజయరాజ్, ముత్యాల శ్రీధర్, పగడాల లక్ష్మయ్య, నరసింహాచారి, మల్లికార్జున్, రవీందర్, ప్రేమసాగర్, బాలాజీ, దైద వెంకటేశ్వర్లు, బొందిలి వెంకన్న, రాగం వీరభద్రం, విజయలక్ష్మి, యాకమ్మ, శ్యామలాదేవి, పద్మలత, రత్నమాల, కళావతి, మల్లయ్య, కాశీపతి పాల్గొన్నారు.

## నర్సుల సేవలు అనిర్వచనీయం


నర్సును సన్మానిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

తొర్రూరు, మే 12 : అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా తొర్రూరు ఏరియా వైద్యశాలలో నర్సులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దవాఖాన సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు మాట్లాడుతూ.. వైద్య సేవల్లో నర్సుల పాత్ర ఎంతో కీలకమన్నారు. నర్సింగ్ అనేది వృత్తి కాదని, అది ఒక మహత్తర బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జ్వలిత, మీరాజ్, ప్రియాంక, మానస, శంకర్ పాల్గొన్నారు.


ఈ –పాస్ యంత్రాలను పంపిణీ చేస్తున్న జేడీఏ

## ఈ- పాస్ యంత్రాల పంపిణీ

మరిపెడ, మే 12 : ఈ–పాస్ యంత్రాలతోనే డీలర్లు ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయధికారి విజయనిర్మల అన్నారు. సోమవారం మండలంలోని గిరిపురం గ్రామ రైతు వేదికలో మరిపెడ డివిజన్‌లోని ఎరువుల డీలర్లుకు ఉచితంగా ఈ –పాస్ యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ అధికారులు ఎరువుల నిల్వలపై సంబంధిత డీలర్లతో సమీక్షించాలన్నారు. ఈ సీజన్‌లో సరిపడా ఎరువులు అందుబాటులో ఉంటాయని, ప్రైవేట్ డీలర్లు, పీఏసీఎస్‌లలో ఈ –పాస్ యంత్రాలతోనే ఎరువులు విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మరిపెడ ఏడీఏ విజయచంద్ర, ఏవో వీరాసింగ్, మహబూబాబాద్ ఏవో విజ్ఞాన్, డివిజన్ అధ్యక్షుడు కాలం శ్రీనివాస్ రెడ్డి, చల్ల హరీశ్, సురేందర్, డివిజన్‌లోని డీలర్లు పాల్గొన్నారు.

## మూఢనమ్మకాలపై కళాజాత

దంతాలపల్లి, మే 12 : మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామంలో దంతాలపల్లి పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం మూఢనమ్మకలపై కళాజాత నిర్వహించారు. పోలీస్ కళాబృందం వారు వివిధ నాటకాలతో మూఢనమ్మకాలు, సైబర్ నేరాలు, మత్తు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ.. యువత గుట్కా, గంజాయి, గుడుంబా వంటి చెడు అలవాట్లకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, మహిళలకు ఇబ్బంది కలిగితే వెంటనే 100కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళా బృందం సభ్యులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565